సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 4 । మార్చి । 2025

రంజాన్ వేళలు	ఇఫ్తార్ మంగళ॥ (సా॥)	సహర్ బుధ ॥ (ఉ॥)
కడప	6.29	5.14
పులివెందుల	6.31	5.19
ప్రొద్దుటూరు	6.30	5.18



ట్రిపుల్ ఐటీలో గెస్ట్ ఫ్యాకల్టీల ధర్నా

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు ధర్నా చేపట్టారు - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0 /22.5

జిల్లాలో సోమవారం 22.5 - 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణ ప్రకటనలు చేస్తే చర్యలు

కడప రూరల్ : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు లింగ నిర్ధారణపై ప్రకటనలు ఇస్తే చట్టరీత్యా కఠిన చర్యలు చేపడతామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టును ఆస్పత్రులు పటిష్టంగా అమలు చేయాలన్నారు. అలాగే తప్పనిసరిగా జిల్లా అప్రప్రియేట్ అథారిటీలో నమోదై చట్టంలోని సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. లేకుంటే నిర్వాహకులకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానాతోపాటు మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష ఉంటుందన్నారు.

నేడు ఆర్‌సీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమ వ్యాప్తంగా ఉన్న ఆర్‌సీపీ ప్రతినిధులతో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ తెలిపారు.సోమవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం పక్కన పెడితే ఉన్న పరిశ్రమలను తరలించడం అధికమైందన్నారు. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి, వాటిపై భవిష్యత్తు రోజు ల్లో ఉద్యమాలు నిర్వహించడానికి, ఈ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా సురేష్‌బాబు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకులకుంట గ్రేడ్ 3 గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబును బి.మఠం ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీగా అదనపు బాధ్యతలు అప్పగించామని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఇక్కడ ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న కుమార రంగయ్య ఒంటిమిట్ట ఇన్‌చార్జీ ఎంపిడీఓ గా అదపు బాధ్యతలు నిర్వహిస్తునప్పుడు నిధుల గోల్‌మాల్ జరిగినట్లు అధికారుల విచారణలో తేలడంతో జిల్లా అధికారులు ఆయనను సస్పెండ్ చేశారని వెల్లడించారు.

19న మహాధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కింద రూ.3వేల గౌరవ వేతనంతో పని చేస్తున్న కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని డిమాండ్‌తో ఈ నెల 19న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న 86 వేల మంది పేద మహిళా కార్మికులు అతి తక్కువ వేతనం తీసుకుంటున్న కార్మికులుగా మిగిలిపోయారన్నారు. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, హెల్త్ కార్డు కూడా లేదని తెలిపారు. పెరిగిన నిత్యవసరాల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల వేతనాల పెంపుదలపై ప్రకటన చేయాలన్నారు. ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా నాయకులు మేరీ, కామాక్షి పాల్గొన్నారు.

7న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని చిన్నపల్లె యోగి శ్రీ నరసింహ్మ స్వామి 217వ ఆరాధన సందర్భంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గోసుల మునిరెడ్డి తెలిపారు. ఇందులో మొదటి బహుమతిగా రూ.70,016, రెండవ బహుమతిగా రూ. 50,016, మూడవ బహు మతి రూ.30.016, నాల్గవ బహుమతి రూ. 20,016, ఐదో బహుమతి రూ. 15,016, ఆరో బహుమతి రూ.10,016 ఉంటాయని వివరించారు.

కంది పోతున్న కర్షకులు!

- ప్రకృతి ప్రకోపం కంది రైతులకు శాపం
- కొనుగోలులో కొర్రీలు వేస్తున్న ప్రభుత్వం
- నానులు, నల్లగింజలు, బేడలంటూ నిరాకరణ
- కాళ్లరిగేలా కొనుగోలు కేంద్రాల చుట్టు ప్రదక్షిణ చేస్తున్న రైతులు

కందుల నాణ్యత ప్రమాణాలు ఇవే...

వివరాలు	నాణ్యత ప్రమాణాలు
తేమశాతం	12 శాతం
ఇతర వ్యర్థ పదార్థాలు	2 శాతం
ఇతర తినదగిన గింజలు	1 శాతం
ఇతర వంట గింజలు	3 శాతం
ముతక/ పూర్తిగా తయారుకాని	3 శాతం
పాక్షికంగా దెబ్బతిన్న, రంగుమారిన	3 శాతం
విరిగిన గింజలు పురుగుకుట్టిన గింజలు	3 శాతం



కందుల తేమశాతాన్ని గుర్తించే పరికరం



కందుల నాణ్యతను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం పరిమళ జ్యోతి

కడప అగ్రికల్చర్ : కూటమి ప్రభుత్వం రైతన్నలకు వ్యతిరేకమని మరోసారి రుజువైంది. ఇప్పటికే పెట్టుబడి సాయాన్ని అందించకుండా మొండిచేయి చూపించిన బాబు ప్రభుత్వం.. తాజాగా పంట కొనుగోళ్లు చేయకుండా కర్షకుల జీవితాలతో ఆడుకుంటోంది. ముఖ్యంగా కందిలో నాణ్యత ప్రమాణాలు లేవంటూ కొనుగోళ్లకు వెనకడుగు వేస్తోంది. అటు సరైన దిగుబడి లేక.. ఇటు ప్రభుత్వం నుంచి ఆదరణ లేక కర్షకలోకం కన్నీరుపెడుతోంది. జిల్లాలో ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల, కడప వ్యవసాయ డివిజన్ల పరిధిలో దాదాపు 30 మండలాల్లో 11 వేలకు పైగా రైతులు దాదాపు 30 వేల ఎకరాల్లో కందిపంటను సాగు చేశారు. ఈ ఏడాది సాగు చేసిన కంది పంటకు సంబంధించి పూతపిందెకు వచ్చే సమయంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ఆకాశంలో మబ్బులు ఏర్పడటం, మొయిలీ కమ్మేయడం వంటి కారణాలతో దిగుబడిపై దెబ్బ పడింది. దీంతో కందుల్లో నల్లగింజ రావడంతో పాటు దిగుబడి కూడా తగ్గింది. దీంతోపాటు మిషన్లతో నూర్పిళ్లు చేయడంతో అక్కకడ్కడ కందులు పగిలి బేడలు కూడా అయ్యాయని పలువురు రైతులు తెలిపారు. కంది పంటకు సంబంధించి ఈ ఏడాది 9497.99 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లుగా అధికారులు అంచనాలు వేశారు.

2374 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా...

రబీ కంది పంటలకు సంబంధించి దిగుబడిలో 25 శాతం మేర కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. కందిపంటలకు సంబంధించి ఈ ఏడాది 9497 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 25 శాతం అంటే 2374 మెట్రిక్ టన్నులను రైతుల నుంచి కొనుగోలు చేయాలని లక్ష్యంగా ఏర్పాటు చేశారు. కాకపోతే ప్రభుత్వం ప్రస్తుతం 1604 మెట్రిక్ టన్నులకు కొనుగోలుకు అనుమతిని ఇచ్చింది. ఈ మేరకు జిల్లాలో కందుల కొనుగోలు కార్యక్రమాన్ని ఫిబ్రవరి 10వ తేదీన ప్రారంభించారు. మార్చి 2వ తేదీ వరకు కేవలం 198 మంది రైతుల నుంచి 205 మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేశారు. అది కూడా పులివెందుల, సింహాద్రిపురం, జమ్మలమడుగు, పొద్దుటూరు కేంద్రాల మాత్రమే కొనుగోలు చేశారు. మిగతా నాలుగు కొనుగోలు కేంద్రాలైన కమలాపురం, తొండూరు, ముద్దనూరు, పోరుమామిళ్ల కేంద్రాల్లో అసలే బోనీయే కాలేదు. కందుల్లో నల్లగింజలు, నాసుగింజలు ఉండటంతోపాటు నూర్పిళ్ల సమయంలో పలు చోట్ల కందులు పగలటంతోకొనుగోలుకు కొర్రీలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు

ప్రభుత్వం కందులకు క్వింటా రూ. 7550 మద్దతు ధరను ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో కందులు క్వింటాల్‌కు రూ. 6500 నుంచి 6800 వరకు పలుకుతుంది. కందులను కొనుగోలు చేసేందుకు ఎనిమిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ప్రతి గింజ కొనుగోలు చేయాలి



నాణ్యత ప్రమాణాలంటూ సాకు చూపించి కందుల కొనుగోలును సరిగా చేయకపోవడం బాధాకరం. నిబంధలను సడలించి ప్రతి రైతు నుంచి కొనుగోలు చేయాలి. ప్రభుత్వం కల్పించే మద్దతు ధర రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. మద్దతు ధరను కూడా పెంచి అందరి కందులను కొనుగోలు చేయాలి. – దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం అనుబంధ, రైతు విభాగం

ఎటువంటి ఆంక్షలు లేకుండా...



కందుల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలి. వాతావరణ మార్పుల వల్ల కందులు కొంత నాణ్యత తగ్గాయి. ప్రభుత్వం స్పందించి నాణ్యత ప్రమాణాలను సడలించి ప్రతి రైతు నుంచి కందులను కొనుగోలు చేయాలి. క్వింటాను పది వేలతో కొనుగోలు చేసి కంది రైతులను ఆదుకోవాలి. – పోతిరెడ్డి భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నిబంధనల మేరకు...



కందుల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం సూచించించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే కొనుగోలు చేస్తున్నాం. ఇంకా పూర్తిస్థాయిలో నూర్పిళ్లు జరగలేదు. నూర్పిళ్లు పూర్తి కాగానే కొనుగోలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికి దాదాపు 205 వందల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. ముమ్ముందు కందుల కొనుగోలును ముమ్మరం చేస్తాం. – పరిమళజ్యోతి, డీఎం, జిల్లా మార్క్‌ఫెడ్

ఢిల్లీ సంస్కృత విద్యాలయ శిక్షణకు మునికుమార్



కడప కల్చరల్ : ఢిల్లీలోని కేంద్రీయ సంస్కృత విద్యాలయం, చిన్మయ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, సొద సంస్థాన్ (ఎర్నాకులం) సంయుక్తంగా నిర్వహించే పది రోజుల శిక్షణకు కడపకు చెందిన నాగదాసరి మునికుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు చిన్మయ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. ఈనెల 12 నుంచి 21వ తేది వరకు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో తాళపత్ర అధ్యయనం, గ్రంథలిపి, శారద లిపి అధ్యయనాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంకా తాళపత్ర గ్రంథాల ఎడిటింగ్‌లో కూడా శిక్షణ ఇస్తారన్నారు. కేరళ ఎర్నాకులంలోని వెలియనాడ్ ఆదిశంకర నిలయంలో ఈ శిక్షణ ఉంటుందని తెలియజేశారు. మునికుమార్ యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు ఎంఏ చేసి ప్రొద్దుటూరు మళయాళ స్వామి కళాశాలలో విద్వాన్ పూర్తి చేశారు.

14 నుంచి కబడ్డీ పోటీలకు ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పులివెందులలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ఎంపికలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఓ రవీంద్రారెడ్డి సెక్రటరీ ఆర్ వెంకటసుబ్బయ్య వైస్ ప్రెసిడెంట్ జి.గురుశేఖర్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 2వ తేదీ డీఎస్ఎస్ స్టేడియంలో 34వ సబ్ జూనియర్స్ బాల బాలికల ఉమ్మడి జిల్లా కబడ్డీ సెలక్షన్స్ జరిగాయని వివరించారు. ఇక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు పులివెందులలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఈ ఎంపికలకు పీడీ నిత్య ప్రభాకర్, జిలాని బాష ,పిడి వర్కింగ్ సెక్రటరీ టి శ్రీవాణి, ట్రెజరర్ కొండయ్య, వైస్ ప్రెసిడెంట్లు అరుణ సుహాసిని లీల సుమలత నరేష్ లోకేష్ తదితరులు సహకరించారన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

- గాలేగరు–నగరి కాలువ తవ్వకం వల్ల తమ గ్రామాల రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకుండా పోయిందని ముద్దనూరు మండలం చింతకుంట గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. పాత రహదారి వద్దే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.
- కమలాపురం పాలిటెక్నిక్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ కింద తనకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులో నియామకం చేయాలని చింతకొమ్మదిన్నె మండలానికి చెందిన పి. రాబియా కోరారు.
- తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని ముద్దనూరు మండలం, పెనికేలపాడు గ్రామానికి చెందిన అంగల్లగుత్తి గంగులమ్మ అభ్యర్థించారు.

బ్యాంకుల భాగస్వామ్యం అవసరం

వ్యవసాయంలో అధునాతన సాంకేతికతను అవసరమైన పెట్టుబడుల కోసం రైతులకు రుణ సహకారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ శ్రీధర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు అందించడంలో సెప్టెంబర్ మాసాంతానికి గాను వైఎస్ఆర్ జిల్లా పురోగమనంలో కొనసాగుతున్నందుకు బ్యాంకర్లను అభినందించారు. జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి.. జిల్లా ఆర్థిక అభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం, డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశానికి సంబంధించిన అజెండా, వివరాలను వివరించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర థియరీ పరీక్షలు సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను కల్పించారు. తొలి రోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలకు సంబంధించి 14690 మంది విద్యార్థులకుగాను 14142 మంది హాజరుకాగా 548 మంది గైర్హాజరయారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్ఐఓ..

కడప నగరంలోని నారాయణ, చైతన్య, సాయిరాం, గాయత్రి తదితర కళాశాలలను ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. అలాగే స్క్వాడ్, డీఈసీ సభ్యులు జిల్లాలోని బద్వేల్, పోరుమామిళ్ల, మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, పులివెందుల, జమ్మలమడుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్, డీబార్ కేసులుకానీ నమోదు కాలేదని ఆర్ఐవో తెలిపారు.

సర్వే(త్రా) ఆందోళన!

- రోజుకో సర్వే చేస్తున్న కూటమి ప్రభుత్వం
- అన్నింటికీ సచివాలయ సెక్రటరీలే ఆధారం
- సంక్షేమ పథకాల్లో కోత పెట్టడానికేనని ప్రజల్లో అనుమానాలు !



కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం రోజుకో సర్వేతో ప్రజల్లో ఆందోళనకు గురి చేస్తోంది. ప్రజల నుంచి పూటకో వివరాలను రాబట్టమని సచివాలయ సిబ్బందితో ఆడుకుంటోంది.

గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తెచ్చింది. 50 ఇళ్లకు ఒక వలంటీర్, 2000 ఇళ్లకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తూ ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేసేవారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను తొలగించారు. గత ప్రభుత్వంలో నెలలో కనీసం రెండు, మూడు సంక్షేమ పథకాలైన అమలవుతూ వాటిని చేరవేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ 9 మాసాల్లో పింఛన్లు మినహా మరే సంక్షేమ పథకమూ అమలు చేయలేదు. దీంతో ప్రభుత్వం వారిని ఖాళీగా ఉంచడం ఇష్టం లేక నానా రకాల సర్వేలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎనర్జీ అసిస్టెంట్లు మినహా మిగిలిన సెక్రటరీలందరితో ఈ సర్వేలు చేయిస్తున్నారు. పీ–4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, చిల్డ్రన్ బర్త్ సర్వే, నాన్ రెసిడెంట్స్ సర్వేలు ఒకేసారి చేయిస్తున్నారు. పీ–4 సర్వేలో ఎంపిక చేసిన వారి ఇంటికి వెళ్లి వారికి కారు, ఏసీ వంటివి ఉన్నాయా..., ఎన్ని ద్విచక్ర వాహనాలు ఉన్నాయి, ఆదాయ పన్ను చెల్లిస్తున్నారా... వంటి వివరాలు అడుగుతున్నారు. పూర్తి వివరాలు నమోదు చేసిన తర్వాత సెల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని సచివాలయ సెక్రటరీకి చెప్పాల్సి ఉంటుంది. అలాగే వర్క్ ఫ్రం హోం సర్వేలో ఎవరి ఇంట్లోనైనా ఐటీ సిబ్బంది, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు వర్క్ ఫ్రం హోం చేస్తున్నారా...వారి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఎంఎస్ఎంఈ సర్వేలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి, వాటి యజమానులు ఎవరు, ఎంతమందికి ఉపాధి కల్పిస్తున్నారు, రుణం ఏమైనా అవసరమా వంటి వివరాలు అడుగుతున్నారు. చిల్డ్రన్ బర్త్ సర్వేలో పుట్టిన బిడ్డకు బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నారా, ఆధార్ కార్డు చేయించారా, ఎందుకు చేయించలేదని వివరాలు కనుక్కుంటున్నారు. ఇక నాన్ రెసిడెంట్స్ సర్వేలో ఎవరి ఇంట్లోనైనా సభ్యులు విదేశాలకు వెళ్లారా...ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్నారా వంటి వివరాలు రాబడుతున్నారు.

పింఛన్లు కొందరికే..

గత ప్రభుత్వంలో భార్య లేదా భర్త పింఛన్ పొందుతూ చనిపోతే బతికున్న భార్య లేదా భర్తకు ఆ పింఛన్ అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మార్చిలో చనిపోయిన వారి భర్త లేదా భార్యలకే పింఛన్లు ఇస్తున్నారే తప్పా ఇదివరకు 9 మాసాలలో చనిపోయిన వారి కుటుంబాలకు పింఛన్ వర్తింపజేయడం లేదు. దీంతో చాలామంది పింఛన్లు పొందకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఉన్న పింఛన్లే తొలగిస్తున్న తరుణంలో ఇక కొత్త పింఛన్లు ఇవ్వడం ఉత్తమాటేనని ప్రజలు అనుమానిస్తున్నారు. ఈ సర్వేల వెనక మతలబు ఇదేనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

సచివాలయ సిబ్బందికి ఎన్ని తిప్పలో!

ఈ అన్ని సర్వేల్లో కేవలం ఇంటిపేరు, పేరు మాత్రమే చెప్పి సర్వే చేయమనడం వల్ల వారు ఎక్కడ నివసిస్తున్నారో, వారి డోర్ నంబర్ ఏమిటో తెలియక సచివాలయ సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. పైగా ఎవరెవరు ఎంత మందిని సర్వే చేశారని ఉన్నతాధికారులు ప్రతిరోజూ టెలీ కాన్ఫరెన్స్‌లో ఒత్తిడి తెస్తున్నారు. ఇంటిపేరు, పేరు ఆధారంగా వారిని ఎలాగోలా కనుక్కున్నప్పటికీ చాలామంది సర్వేలకు సహకరించడం లేదని, ఓటీపీలు చెప్పడం లేదని తెలుస్తోంది. అత్యధిక మంది ఇంటిలోపలికే సచివాలయ సిబ్బందిని అనుమతించడం లేదని సమాచారం. దీంతో కరవమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపం... అన్నచందంగా సచివాలయ సెక్రటరీల పరిస్థితి తయారైంది. రెండు, మూడు నెలల కిందటే వికలాంగుల పింఛన్లపై వెరిఫికేషన్ పూర్తయ్యింది. ఇప్పుడు ఏకంగా 5 సర్వేలు ఒకేసారి చేయిస్తున్నారు. త్వరలో స్వర్ణాంధ్ర సర్వే కూడా చేపట్టనున్నట్లు వార్తలొస్తున్నాయి. దీంతో ఇంకా ఎన్ని సర్వేలు చేయాలోనని సచివాలయ సెక్రటరీలు లోలోపలే మథనపడుతున్నారు.

రెడ్డెమ్మ మాటల వెనక మత్తులబు ఏమిటో !

- అమ్మాయిలను టార్గెట్ చేస్తూ మత్తు పానీయాలు
- కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి హాట్ కామెంట్



సాక్షి ప్రతినిధి, కడప: కూటమి సర్కార్‌లో గంజాయితో పాటు మత్తు డ్రగ్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయని అసెంబ్లీ వేదికగా కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కడపలో పానీయాలల్లో మత్తు కలిపి అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారని హాట్ కామెంట్ చేశారు. యువకులు మత్తు డ్రగ్ ఇంజక్షన్లు వేసుకుంటున్నారంటూనే మెడికల్ స్టోర్స్‌లో మత్తు డ్రగ్స్ విక్రయాలు కట్టడి చేయాలన్నారు. గంజాయి తగ్గుము ఖం అంటూనే ఆ స్థానంలో మత్తు డ్రగ్స్ వచ్చి చేరినట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి 9నెలలు కావస్తోంది. గంజాయి కట్టడి చేస్తున్నామని చెప్పుకోవడం మినహా ఆశించిన స్థాయిలో కంట్రోల్ కాలేదని అధికార పార్టీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి స్పష్టం చేశారు. గంజాయి స్థానంలోకి డ్రగ్స్ వచ్చి చేరినట్లు చెప్పుకొచ్చారు. వాస్తవంలో పరిశీలిస్తే గంజాయి కట్టడికి ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. కౌన్సెలింగ్ ఇస్తూనే డీ ఆడిక్షన్ సెంటర్ సెంటర్‌కు పంపుతున్నారు. మరోవైపు డ్రగ్స్‌లాగా ఉపయోగించే ఓపీయార్డ్స్ మాత్రలు, ఇంజక్షన్లు విక్రయాలు చేస్తున్నట్లు తెరపైకి వచ్చింది. ఆ మేరకు జిల్లాలో రెండు మెడికల్‌స్టోర్స్‌పై ఆరోపణలు రావడంతో సీజ్ కూడా చేసినట్లు తెలుస్తోంది. మత్తు మందుల విక్రయాలు చేపట్టరాదని డ్రగ్స్ డీలర్లు, ఏజెంట్లకు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ అయినట్లు తెలుస్తోంది.

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే...

ఇదివరకూ జిల్లా కేంద్రంలో గంజాయి విచ్చలవిడిగా లభిస్తోందని, కట్టడి చేయాల్సిందిగా అప్పటి ఎస్పీ హర్షవర్ధనరాజుకు ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఫిర్యాదు చేశారు. తాజాగా అసెంబ్లీ వేదికగా గంజాయితోపాటు మత్తు డ్రగ్స్ వల్ల ఇలాంటి వైపరీత్యాలు అధికమయ్యాయని సోమవాళం గళం విప్పారు. పానీయాల్లో మత్తు డ్రగ్స్ కలుపుతూ అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారని కూడా ఆరోపించారు. ఇలాంటి కేసులు ఇప్పటి వరకూ అధికారికంగా నమోదు కాకపోయినా, అధికారపార్టీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.

నిజంగా ఉందా.. ప్రచార ఆర్భాటమా!

కడపలో నిజంగా అలాంటి పరిస్థితి ఉంటే స్థానికంగా సమీక్షలు చేపట్టి కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉంది. బాధ్యతయుతమైన ప్రజాప్రతినిధిగా మత్తు మందులు విక్రయించేవారిని కట్టడి చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు అధికారికంగా ఒక్క కేసు నమోదు కాలేదు.పైగా వీటి నివారణకు అలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో కట్టడి చేసే చర్యలు చేపట్టకపోగా, ప్రచార ఆర్భాటాలకే ఎమ్మెల్యే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. మత్తు డ్రగ్స్, గంజాయి విక్రయాలు కట్టడిలో కూటమి సర్కార్ విఫలమైందని ఆమె మాటలు స్పష్టం చేస్తున్నాయి. పైగా ఇప్పటికీ గంజాయి లభ్యమౌతోందని, దానికి తోడుగా అదనంగా మత్తు డ్రగ్స్ విక్రయాలు ఉన్నాయని ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్పష్టం చేశారు. దీనిని కట్టడి చేసేందుకు హోంమంత్రి ఎలాంటి చర్యలు చేపడతారో ఆలోచించాలని కూడా కోరడం విశేషం.

క్లుప్తంగా

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు


బాలాంజనేయులు (ఫైల్)

కడప అర్బన్ : ఓ వ్యక్తి కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరి, అక్కడి నుంచి పరారైన రెండు నెలలకు శవమై కనిపించాడు. ఈ సంఘటనపై కడప రిమ్స్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరులో నివాసం ఉంటూ కలమల్లలోని ఆర్‌టీపీపీలో ఉద్యోగం చేస్తున్న బాలాంజనేయులు (54) తీవ్రంగా అనారోగ్యం పాలయ్యాడు. అతన్ని కుమారుడు రాజశేఖర్, తన కుటుంబ సభ్యులతో కలిసి కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఈ ఏడాది జనవరిలో చేర్పించారు. ఆయన చికిత్స పొందుతూ జనవరి 6న భోజనానికి వెళ్లి వస్తానని చెప్పి పరాయ్యాడు. అన్ని చోట్ల వెతికిన కుమారుడు, కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 19న రిమ్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. జ్యోతి కెమికల్స్ సమీపంలోని ఓ గుంతలో గుర్తు తెలియని శవం ఉందని స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాలాంజనేయులు ధరించిన దుస్తులను గమనించి ఆయన తన తండ్రేనని కుమారుడు రాజశేఖర్ పోలీసులకు తెలిపాడు. కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నారు. మంగళవారం సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించనున్నారు.

రిటర్న్ మస్టర్ ఎత్తివేయాలి


మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో మున్సిపల్ కార్మికులకు అమలు చేస్తున్న రిటర్న్ మస్టర్ విధానాన్ని ఎత్తివేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు కె. తిరుపాల్ మాట్లడుతూ కడప నగరంలో మున్సిపల్ కార్మికులు ఉదయం 5గంటలకే మస్టర్‌కు రావాలనే నిబంధన విధించారన్నారు. దూర ప్రాంతం నుంచి వచ్చే కార్మికులు తెల్లవారుజామున 3గంటలకు నిద్రలేచి రావడం ఇబ్బందికరంగా ఉందన్నారు. మహిళలు కాలువలో తీసిన పూడిక తడిగా ఉన్నప్పుడే ఎత్తాలంటే సాధ్యం కావడం లేదన్నారు. రిటర్న్ మస్టర్ విధానం రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలోగానీ, కార్పొరేషన్లలోగానీ లేదన్నారు. ఈమేరకు వారు కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీరామ్, నగర సహాయ కార్యదర్శి ఇ. ప్రకాష్ , డ్రైవర్ల కమిటీ కార్యదర్శి ఎస్. కిరణ్, నాగరాజు, పెంచలమ్మ ఆరోగ్యమ్మ, హేమలత, రమాదేవి, ఆదాము పాల్గొన్నారు.


వక్ఫ్ బిల్లును అసెంబ్లీలో వ్యతిరేకించాలి


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఆప్‌కీ ఆవాజ్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2024 వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, ఆప్‌కీ వాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఇందిరమ్మ సర్కిల్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సయ్యద్ గౌస్ పీర్ చేపట్టిన 36 గంటల దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్క రాష్ట్రాలు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానాలు చేశాయని మన రాష్ట్ర ప్రభుత్వం కూడా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. వక్ఫ్ ఆస్తులను ఉపయోగిస్తున్న వారి విషయంలో జోక్యం చేసుకోకూడదనడం ఆక్రమణదారులకు రక్షణ కల్పించడమే తప్ప మరొకటి కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

మా తుఝే సలాం

- రోజా పాటించేందుకు సహర్ తప్పనిసరి
- సహరీ ఏర్పాట్లలో మహిళల కీలక పాత్ర
- వేకువ జామున మూడు గంటల నుంచే వంటల తయారీ
- ఉపవాస దీక్షతోనే పగలంతా ఇంటి పనులు



రాజంపేట టౌన్ : పవిత్ర రంజాన్ మాసంలో అనేక మంది ముస్లింలు విధిగా ఉపవాస దీక్షలు చేపడతారు. అల్లాహ్ మార్గాన్ని అనుసరించే పంచ సూత్రాల్లో మూడవది అయిన 'రోజా'కు ఎంతో ప్రాధాన్యత ఉంది. దీక్ష పాటించాలంటే సహరీ (దీక్ష ప్రారంభానికి తీసుకునే ఆహారం) తప్పనిసరి. ఈ ఆహారాన్ని తెల్లవారుజామున దీక్షకు ముందు నిర్ణీత సమయంలోపే తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల నిర్ణీత సమయానికి ఆహార పదార్థాల తయారీలో మహిళల పాత్ర ఎంతో కీలకం . పగలంతా ఇంటి పని, సాయంత్రం నుంచి ఆధ్యాత్మిక చింతన, రాత్రి తరావీహ్ నమాజ్‌ల తరువాతే నిద్రకు ఉపక్రమిస్తారు. అలాగే సహర్ ఏర్పాట్ల కోసం మహిళలు తెల్లవారుజామున మూడు గంటలకు విధిగా నిద్రలేవాల్సి ఉంటుంది. ఇక అప్పటి నుంచి కుటుంబంలోని భర్త, పిల్లలు ఉపవాసం ఉండేందుకు వంటలు చేయడం ప్రారంభిస్తారు. ఒకరోజు, రెండు రోజులు కాదు ముప్పై రోజుల పాటు మహిళలు నిద్రను త్యాగం చేస్తూ సహరీ నిర్ణీత సమయానికి ఆహారాన్ని సిద్ధం చేస్తారు. పగలు రోజా ఉంటూ, ఇంట్లోని పనులు, కుటుంబ సభ్యులకు సేవలు చేస్తూ సాయంత్రం ఇఫ్తార్‌కు వంటలు సిద్ధం చేసే 'మహిళా మూర్తులందరికి సలాం' చేయాల్సిందే. ఉద్యోగాలకు వెళుతూ కూడా రంజాన్ మాసంలో సహర్‌కు వంటలు తయారు చేసి విధులకు వెళ్లే మహిళలు కూడా ఎంతో మంది ఉన్నారు.

బర్కత్ కలిగిన సహర్

'సహరి ఖాయా కరో.. సహరి మే బర్కత్ హై' అంటూ మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా సొల్లెలాహు అలైహి వసొల్లం చెప్పినట్లు ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. అంటే రోజా దీక్షలకు ముందు భోజనం చేయండి, అందులో అల్లాహ్ అనుగ్రహం, పొదుపు ఉందని అర్థం. అంతటి మహత్తర సహర్ సందర్భంగా ఆహారం తీసుకుంటే శక్తితో పాటు అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది.

మహిళలకు ప్రత్యేక పుణ్యం


సహర్ కోసం వంట చేస్తున్న మహిళ

ఒకవైపు కళ్లల్లో నిద్ర ఉన్నా రంజాన్ శుభాలు, అల్లాహ్‌పై ఉన్న భక్తితో మేల్కొని వంటలు చేసే మహిళల పట్ల అనంత కరుణామయుడు ప్రత్యేక పుణ్యం ప్రసాదిస్తాడని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. తనకోసమే కాదు కుటుంబ సభ్యుల దీక్ష కోసం నెలరోజుల పాటు నిద్రను త్యాగం చేసి సహర్ కోసం శ్రమించే మహిళలకు అల్లాహ్ రెండింతలకంటే అధికంగా పుణ్యం ప్రసాదిస్తాడని ముస్లిం మతపెద్దలు చెబుతున్నారు.

అల్లాహ్ ఆరాధనలో అలుపు ఉండదు



రంజాన్ మాసంలో మహిళలకు పని ఎక్కువగానే ఉంటుంది. పగలంతా ఇంటి పనులు, తెల్లవారుజామున మూడు గంటలకే నిద్రలేచి సహర్ వంటలు చేయాల్సి ఉంటుంది. ఎంతో భక్తితో రోజంతా మేము చేసే పనికి అల్లాహ్ అనుగ్రహం ఉంటుంది. అందువల్ల మేము ఎంత శ్రమించి పనిచేసినా అలుపు ఉండదు.

\- షేక్ రహమతున్నీసా, రాజంపేట

రంజాన్‌లో సేవలు సంతృప్తినిస్తాయి



రంజాన్ మాసం అంటేనే ఉపవాస దీక్షలు. భక్తితో ఉపవాసం ఉంటూనే నేను వృత్తి రీత్యా స్కూల్‌కు వెళుతున్నాను. నమాజ్, జికిర్‌లతో పాటు బాధ్యతగా తెల్లవారుజామున మూడు గంటలకే నిద్రలేచి సహర్ కోసం ఏర్పాట్లు చేస్తాను. రంజాన్ మాసంలో చేసే ఈ సేవలు నాకు ఎంతో సంతృప్తినిస్తాయి.

\- షేక్ అమీనా, ఉపాధ్యాయిని, ఉర్దూ హైస్కూల్, రాజంపేట

ట్రిపుల్ ఐటీలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగుల ధర్నా


డైరెక్టర్ కుమారస్వామికి వినతి పత్రం అందజేస్తున్న ట్రిపుల్ ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలకు మినిమం టైం పే స్కేల్ అమలు చేయాలంటూ నినాదాలు చేస్తూ గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. సోమవారం కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోని అకడమిక్ బ్లాక్ వద్ద గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు ధర్నా చేశారు. ఎస్ఐ తిరుపాల్ నాయక్ ధర్నా జరిగే ప్రాంతానికి చేరుకుని ధర్నా విరమించాలని ఉద్యోగులను కోరారు. అలాగే ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్‌లు కూడా అకడమిక్ బ్లాక్ వద్దకు చేరుకుని ధర్నా చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినకుండా భీష్మించుకుని కూర్చున్నారు. ఈ సందర్భంగా గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జీఓ నెంబర్ 110ని ఆర్జీయూకేటీ అధికారులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా గౌరవించకుండా గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులకు ఆర్జీయూకేటీ అధికారులు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2018లో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులుగా ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 44 మంది పని చేస్తున్నారని, ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఒక రూపాయి కూడా జీతం పెంచలేదన్నారు. తప్పుడు సమాచారం తీసుకుని తమ వెనుక వచ్చిన ఉద్యోగులకు జీతాలు పెంచారన్నారు. అనంతరం ఆర్కే వ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం


కలెక్టరేట్ వద్ద డీవైఎఫ్ఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వ సంస్థ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేసిన కడపకు చెందిన ఆది రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. సోమవారం బాధితులతో కలిసి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కెరీర్ కౌన్సిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ ఉద్యోగం పేరుతో జిల్లాలో చాలామంది వద్ద రూ. 4-6 లక్షలు చొప్పున వసూలు చేశాడని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన అపాయింట్‌మెంట్ లెటర్స్ అంటూ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్‌కు, ఆర్‌జేడీ, డీఈఓలకు సైతం ఫేక్ మెయిల్స్ పంపి వారిని సైతం మోసగించాడని తెలిపారు. ఈ విషయం వెల్లడి కావడంతో నిరుద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. బాధితులంతా రవికుమార్ వద్దకు వెళ్లి తమ డబ్బులు తమకు చెల్లించాలని కోరగా, ఆయన స్పందించడం లేదన్నారు. అధికారులు కూడా ఉద్యోగాల్లో చేర్చుకునే ముందు అపాయింట్‌మెంట్ లెటర్లు నకిలీవా? నిజమైనవా? అంటూ నిర్ధారించుకోకుండా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకుని బాధితులకు డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్


ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరమని, బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశం దూరం చేస్తాయని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడారు. అనంతరం జేసీ బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీలక్ష్మి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : మున్సిపాలిటీలోని ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్‌చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, యూనియన్ గౌరవాధ్యక్షులు బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావులు మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తామని మంత్రివర్గ సమావేశంలో తీర్మానించడం అన్యాయమన్నారు. ఆప్కాస్ రద్దును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతినెల ఒకశాతం కమీషన్‌తో వేతనాలు, సేవలు అందించే ఆప్కాస్‌ను రద్దు చేసి నాలుగు శాతం కమీషన్ తీసుకునే కాంట్రాక్టర్ల చేతికి లక్షా 20 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తును అప్పగించడం దారుణమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుంచపాటి జాన్, ఈశ్వరయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మిరప, పప్పుశనగ, కందులను గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ కోరారు. సోమవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండుమిరప, పప్పు శనగ, కందులు పండించిన రైతులు కల్తీ, నకిలీ విత్తనాల వలన, చీడ, పీడల వలన సరైన దిగుబడులు రాక, చేతికొచ్చిన అరకొర పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం వలన తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మిరప క్వింటాల్ రూ. 11వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని, దిగుబడులు తగ్గిపోవడం వలన క్వింటాల్ రూ. 20వేలకు తక్కువ కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి, నాయకుడు పకీరప్ప పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతి చెందిన మేరీ

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి మండలం గంగనపల్లె దళితవాడకు చెందిన లూర్దు మేరీ (52) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. లూర్దుమేరీ భర్త నాగులుగారి సుబ్బరాయుడు మద్యం తాగి తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఆమె ఒంటిపై తీవ్ర గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సోమవారం సంఘటన స్థలాన్ని కడప రూరల్ సీఐ చల్లని దొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిలు పరిశీలించారు. భర్త తీవ్రంగా కొట్టడంతోనే ఆమె మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కుమార్తె నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ట్రాప్ కెమెరాల్లో కనిపించని చిరుత జాడలు


ట్రాప్ కెమెరాలను పర్యవేక్షిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఫిబ్రవరి నెలలో చిరుతల అడుగు జాడలు, చిరుతల పిల్లలు కనిపించాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేసిన విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ శాఖ అధికారుల ఆదేశాల మేరకు గతనెల 15వ తేదీ నుంచి నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, బ్రాహ్మణపల్లె, లింగాల మండలం ఇప్పట్ల, కామసముద్రం, రామాపురం గ్రామాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గోపాలకృష్ణ, శ్రీనివాస నాయుడు, మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో ప్రతిరోజు ట్రాప్ కెమెరాలలో చిరుత అడుగు జాడలు, చిరుత పిల్లలు ఏవైనా కనిపించాయా అని పర్యవేక్షిస్తున్నారు. గ్రామాలలో ఎక్కడే గాని చిరుతలు, వాటి పిల్లల అడుగులు కనిపించడం లేదన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల చిరుతలు చల్లగా ఉండే ప్రాంతాలకు వెళ్లిపోయి ఉండవచ్చంటున్నారు.

పసికందు మృతిపై ఆస్పత్రి వద్ద ఆందోళన


ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాలుడి కుటుంబ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పసికందు మృతి చెందడంతో బాలుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గండికోట గ్రామానికి చెందిన గురుమోహన్ భార్య నాగేశ్వరి మగబిడ్డను ప్రసవించింది. పుట్టిన వెంటనే పసికందు ఏడ్వకపోవడంతో 21న ప్రొద్దుటూరులోని పోసినా కాంపౌండ్‌లో ఉన్న వారాహి సూపర్ స్పెషాలిటి చిన్న పిల్లల హాస్పిటల్‌లో చేర్పించారు. పరిశీలించిన వైద్యుడు చికిత్సకు రూ. 25 వేలు అవుతుందని చెప్పడంతో గురుమోహన్ దంపతులు సరేనని చెప్పారు. ఐసీయూలో ఉంచి పసికందుకు చికిత్స ప్రారంభించారు. ఈ క్రమంలో రెండు, మూడు రోజులు గడిచిన తర్వాత బాలుడి ఆరోగ్యం కుదుట పడిందని, రెండు రోజులయ్యాక డిశ్చార్జ్ చేస్తానని వైద్యుడు చెప్పినట్లు గురుమోహన్ తెలిపారు. అయితే తర్వాత శిశువు ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని వైద్యుడు చెప్పారన్నారు. బయటికి వెళ్లడానికి కూడా సమయం లేదని చెప్పడంతో ఇక్కడే ప్రయత్నం చేయాలని గురుమోహన్ కుటుంబ సభ్యులు చెప్పారన్నారు. అందుకు కొంత డబ్బు ఖర్చు అవుతుందని వైద్యుడు చెప్పగా అందుకు అంగీకరించామన్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శిశువు మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో సోమవారం ఉదయం తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. రూ. లక్షలు డబ్బు ఖర్చు చేసినా పసికందు తమకు దక్కలేదని రోదించసాగారు.

చేరినప్పటి నుంచి బాలుడిది సీరియస్ కండీషనే

హాస్పిటల్‌లో చేరినప్పటి నుంచి శిశువు సీరియస్ కండీషన్‌లోనే ఉన్నట్లు ఆస్పత్రి వైద్యుడు లోకేష్‌కుమార్ తెలిపారు. గుండె వేగంగా కొట్టుకోవడంతో పాటు ఇన్‌ఫెక్షన్ కూడా ఎక్కువగా ఉందన్నారు. వచ్చిన వెంటనే ఫిట్స్ కూడా వచ్చాయన్నారు, ఈ పరిస్థితుల్లో ఎక్కడికైనా వెళ్లమని చెప్పామన్నారు. ముందుగా వెళ్తామని చెప్పిన గురుమోహన్ దంపతులు ఇక్కడే ఉంటామని చెప్పినట్లు డాక్టర్ చెప్పారు. ట్రీట్‌మెంట్ ప్రారంభించిన తర్వాత బాబు ఆరోగ్యం మెరుగుపడిందని, తల్లి పాలు తాగుతున్నాడని తెలిపారు. రాత్రి సమయాల్లో ఐసీయూలో, పగలు తల్లి వద్ద ఉంచామన్నారు. తల్లివద్ద ఉంటే వెచ్చదనం తగిలి బాలుడు త్వరగా కోలుకుంటాడని ఉద్దేశంతో చెప్పామన్నారు. అయితే తల్లి బాలుడిని సరిగా చూసుకోలేదని తెలిపారు. బాలుడిని ఫ్యాన్ కింద పడుకోబెట్టడంతో పూర్తిగా చల్లబడిపోయాడని, వెంటనే ఐసీయూలోకి తరలించామన్నారు. ఈ క్రమంలో బాలుడు మృతి చెందినట్లు డాక్టర్ లోకేష్‌కుమార్ తెలిపారు. బాలుడికి పూర్తి స్థాయిలో చికిత్స చేశామని, తమ చికిత్సలో ఎలాంటి తప్పులు దొర్లలేదన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో విచ్చలవిడిగా మాస్ కాపీయింగ్ జరుగుతోందని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ ఆరోపించారు. సోమవారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకవైపు డీఈఓ పకడ్బందీగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటిస్తుంటే మరోవైపు జిల్లా కో-ఆర్డినేటర్ మాత్రం మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారన్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి శ్రీకాంత్ సభ్యుడు ఉదయ్ పాల్గొన్నారు.

పీజీ కామన్ సెట్ విధానాన్ని రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం పీజీ కామన్ సెట్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తల అరుణ్ కోరారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం పీజీ కామన్ సెట్ విధానాన్ని, జీఓ 77ను రద్దు చేయాలని కోరుతూ నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 77 తీసుకురావడం వల్ల 10 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఈ జీఓను రద్దు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు ఈశ్వరరెడ్డి, నాగార్జున, గణేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించామని పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్ తెలిపారు. ఈ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు నోటీసు బోర్డులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యను విన్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు, డి.టి.సి డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పి.ఎస్. డీఎస్పీ రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను బురిడీ కొట్టించిన బడ్జెట్

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : ఏపీ అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ అంతా అంకెల గారడీ అని, బడ్జెట్‌లో గారడీలు, పేరడీలు చేసి ప్రజలను బురిడీ కొట్టించారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రం దివాళా తీసిందంటారు? ఇప్పటికే రూ.లక్ష కోట్లు అప్పు చేశారు, ఇది ఎలా సాధ్యం అని ఆయన ప్రశ్నించారు. రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌లో 25 శాతం ద్రవ్యలోటు అంటే 80వేల కోట్లు లోటు బడ్జెట్ ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో రూ.14వేల కోట్లు ప్రజలపై భారం మోపుతామని అసెంబ్లీలోనే మంత్రి చెప్పారని, దీంతో ప్రజలకు వాతలు తప్పవన్నారు. మరో రూ.12వేల కోట్లు ప్రభుత్వ స్థలాల ద్వారా అప్పు తెస్తారంటా? ఇది ఎలా చేస్తారో మరి? అని అన్నారు. మిగిలిన రూ. 54వేల కోట్లు కేంద్రం నుంచి తెస్తామంటున్నారని, కేంద్ర బడ్జెట్ ఎప్పుడో పూర్తి అయిందని, ఆ బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులే లేవన్నారు. ఇదంతా చూస్తుంటే ఈ బడ్జెట్ చాలీ చాలనీ బడ్జెట్ అని, అసంపూర్తి బడ్జెట్ అని, ప్రజలను మోసం చేసేదానికే ఈ బడ్జెట్ అని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో ఉచిత బస్సు ప్రయాణం, 18ఏళ్ల నిండిన వారికి నెలకు రూ.1500 అన్నారు. ఒక్క పథకానికి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. జగనన్న సంక్షేమాన్ని ఇంట్లో బంధించాడు.. అభివృద్ధిని గుమ్మం బైట ఉంచాడన్నారు. మరి చంద్రబాబు అధికారంలో ఉన్నంత వరకు రాష్ట్ర ప్రజల సంక్షేమం అంధకారమే అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే తరిమి కొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, గంగాధర్ రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, ఇస్మాయిల్, చెన్నకేశవరెడ్డి, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి,జగన్‌మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి,మోనార్క్,మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

పీరయ్య అంత్యక్రియలకు హాజరైన నందమూరి రామకృష్ణ


పీరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న నందమూరి రామకృష్ణ, ఇతర టీడీపీ నేతలు

కడప రూరల్ : నందమూరి అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పోతుగంటి పీరయ్య ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన అంత్యక్రియలు సోమవారం సాయంత్రం స్థానిక కృష్ణా సర్కిల్‌వద్దగల యాకుబ్ సాహెబ్ మసీదు స్మశాన వాటికలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు నందమూరి రామకృష్ణ హాజరయ్యారు. ఆయన వెంట గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తితోపాటు స్థానిక టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జిలానీబాషా, హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, కరీముల్లా, నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.